# మిత్రద్రోహం

నాకేదో యింత భగవంతుడిచ్చాడు. నేను జైలుకు వెళ్ళిన వాణ్ణి కాక పోయినా నా కొడుకు లిద్దరూ ప్రభుత్వోద్యోగాలు చేసుకుంటున్నారు. వెనక దొరల ప్రభుత్వంలో ఎంత శ్రద్ధగా తమ పని చేసుకొని పోయినారో ఇప్పుడు మన కాంగ్రేసు వాళ్ళకిందకూడా అంత శ్రద్ధగానూ ఉంటున్నారు. ఇళ్ళ అద్దెల మీద, పొలం మీద నాకేదో ఏటా రెండు మూడు వేలు వస్తుంది. అందుచేత నాకు ఇహ చింత లేదు. నేనేమో నా భగవధ్యానమేమో!

అందుచేత నాకు సీతారామస్వామి ఎక్కువాలేదు. రఘుపతి తక్కువా లేదు. ఇద్దరూ కావలసినవాళ్ళే. వాళ్ళిద్దరికి చెడ్డదంటే, మీరు నమ్మరుగానీ నేనెంతో ఖేదించానన్నమాట.

మేము ముగ్గురమూ విడవకుండా తిరిగేవాళ్ళం. అదేం చిత్రమో ప్రపంచం మంచి ఎక్కడ వున్నా సహించలేదుగద. మేము ముగ్గురమూ కలిసి తిరిగితేనే మా సహాధ్యాయిలు సహించలేక పోయారు. మమ్మల్ని విడగొట్టటానికి ఎన్ని ప్రయత్నాలు చేశారు! రఘుపతితో అనేవాళ్ళుగదా "ఒరే, నీతోకలిసి చదవకపోతే స్వామికి ఇంగ్లీషులోనూ, లెక్కలలోనూ సున్నాయే. అటువంటి వాడితోకన్న మరెవరైనా ఇంకా తెలివిగల వాడితో కలిస్తే యింకా మార్కులు ఎక్కువ వస్తాయిరా!" అనేవాళ్లు. రఘుపతి తండ్రి తద్దినాలు పెట్టాడనీ, వితంతువివాహాలు జరిగితే వెళతాడనీ నాతో చెప్పేవాళ్ళు. నేను రఘుపతీ వెళ్ళి రాత్రిపూట స్వామి ఇంట్లో చదువుకుని కిరసనాయిలు ఆదాచేస్తున్నామని కూడా అన్నారనుకోండి.

అయినా మేం చీలిపోలేదు. మాది అంత మంచిస్నేహం. నేను చదువు మానేసినాక కూడా వాళ్ళిద్దరూ బి. ఎ. దాకా కలిసి నెట్టారు. వాళ్ళిద్దరూ పాసయితే నేను కూడా బియ్యే పాసయినట్టే సంతోషించాననుకోండి. మాది అటువంటి స్నేహం.

కావటానికి మాలో స్వామి కాస్త ధనికుడే. రఘుపతి కూడా నా కంటే ఇంత కలవాడే. అయితే మాలోమేం అటువంటి పట్టింపులెప్పుడూ కలవాళ్ళంకాం. ఇంత కాలానికి రఘుపతి, స్వామి కలిమిచూచి అసూయ పడుతున్నాడనుకోవడానికి నాకే మాత్రమూ మనస్కరించలేదు. కాని స్వామిమీద రఘుపతిచేసే దుష్ప్రచారానికి మరే ఆధారం ఉండదనుకోవాలి.

స్వామి దాదాపు రెండు లక్షలు చేసుకున్నాడంటే నిజంగా సంతోషించవలసిన

వాళ్లలో నేనూ, రఘుపతి మొదటి వాళ్ళం. నేను సంతోషించాను. రఘుపతి మరొక లాగా మాట్లాడనవసర మేముందీ ?

పోనీ స్వామి కూడనిపని ఏమన్నా చేశాడుగనకనా? చేనేత గుడ్డల వ్యాపారం చేసుకున్నాడు. అతను చేసిన పెట్టుబడి పదివేలే అయినా రోజులు కలిసిరావటం వల్ల అంతకు ఏడింతలు లాభించింది. వర్తకమన్నా తరవాత లాభాలే ఉంటాయనే మిటి ? రఘుపతి కూడా చేనేత గుడ్డల వ్యాపారం చేసినవాడేగా. ఎందుకు నష్టపడ్డాడూ? తనకు నష్టం వచ్చిందిగనక లాభం వచ్చినందుకు స్వామిని ఆడిపోయ్యటం ఏంసబబుగావుందీ ?

నన్నడిగితే డబ్బుకన్న పాపిష్టిదిలేదు. దరిద్రులే సంఘానికి శత్రువులు. పాకీవాళ్ళు చూడండి, కార్మికులు చూడండి, రైతుకూలీలు చూడండి, వీళ్ళ మనకు తెచ్చే అగచాట్లకు అంతంటూవుందా ? హత్యలూ, దొంగతనాలు, దోపిడీలు చేసేది ఎవరు ? రఘుపతి యివ్వాళ దరిద్రుల జాబితాలో చేరాడు. అందుచేత అతను ఏమన్నా నా కాశ్చర్యంలేదు. డబ్బు పాపిష్టిది !

ఇద్దరూ ఒకే వ్యాపారం చేస్తే చేశారు. కలిసి చెయ్యకుండా ఎవరి దారిని వాళ్ళు చేసుకుంటే అదెట్లావుండేదో, రఘుపతివెళ్ళి స్వామితో ఎందుకు కలవటం? తన గుడ్డంకొట్టేమో, తానేమో అన్నట్టుంటే ఏ పేచీ లేకపొయ్యేదిగా ? స్వామికి పెట్టుబడి చాలని మాట నిజమేననుకొందాము. అంత చాలకపోతే ఉన్నదాని మీద రాబడితోనే తృప్తిపడేవాడో, ఎక్కడైనా తల తాకట్టుపెట్టి తెచ్చుకునేవాడో. రఘుపతి కెందుకూ? డబ్బు దగ్గిరనా స్నేహితాలు ? తను కూడా స్వామికి పది వేలిచ్చాడు. స్వామి తయారు చేయించే బట్టలు జిల్లా అంతటా తానే అమ్మి లాభాలు తీద్దామని ఆశపడ్డాడు. రఘుపతి యిచ్చిన డబ్బు స్వామి తన వ్యాపారంలో పెట్టుబడి చేసుకున్నాడు. దానివల్ల వ్యాపారం బాగా సాగింది కూడాను. సాగినంత కాలమూ రఘుపతి వ్యాపారం కూడా బాగానేసాగింది. స్వామి రఘుపతికి ఒక్కడికే రెండు మూడు లక్షల రూపాయల గుడ్డ అందించాడు. రఘుపతి ఆ డబ్బంతా ఎప్పటికప్పుడు స్వామికి పంపుతూ వచ్చాడనుకోండి. దానివల్ల తన వ్యాపారమే పెంచుకున్నాడు. కాని స్వామికి ఒరగబెట్టిందేముంది. నేతగుడ్డకి ధరలు పడిపోతా యని ముందుగానే తెలుసుకుని స్వామి వ్యాపారం ముగించుకుని దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకున్నాడు. రఘుపతి కా అవకాశం లేకపోయింది. పదివేల రూపాయల గుడ్డ అతని దగ్గిర మిగిలిపోయింది. దానిక్కూడా యిప్పుడు ధర పడిపోయిందనుకోండి. దాని నెవరేం చేస్తారూ ?

ఇద్దరూ కలిసి అయిదారేళ్ళు వ్యాపారం చేశారుగదా, ఇప్పుడు తీరా వ్యాపారం అయిపోయినాక తనను ముంచాడని స్వామినిగురించి రఘుపతి ప్రచారం చెయ్యటం ఏమైనా బాగుందా ? అవును స్వామికి వ్యాపారం కలిసి వచ్చింది. రాహు మహాదశ ఆరంభంకాగానే అతనికి సిరిఎత్తుకుంటుందని రాసి

పెట్టే ఉంది. "తనతో సమంగా నేనూ పెట్టుబడిచేశాను. తన లాభాలలో నాకు దమ్మిడీ యివ్వలేదు!" అంటాడు రఘుపతి. "రఘుపతి నాచేతికిచ్చిన ప్రతి దమ్మిడీకి లెక్క నా దగ్గిరనే ఉంది. అంతకీ నేను గుడ్డ అందిస్తూనేవచ్చాను." అంటాడు స్వామి.

రఘుపతి యింతా అసందర్భాలు చాలా చెబుతాడనుకోండి. నేతగుడ్డతో ముతకరకం వేలకు వేల సరుకు ఖద్దరుకింద బొంబాయికి స్వామి ఎగుమతిచేశాట్ట. దానిమీద చాలా లాభాలు తిన్నాట్ట. తనకు తెలియకుండా తనమీద పోటీకి చౌకగా మా జిల్లాలోనే యింకా ఇతరులకు స్వామి గుడ్డ అమ్మాట్ట. చేనేత వ్యాపారం మీద లాభాలతో స్వామి యింకా అనేక వ్యాపారాలు చేశాట్ట. స్వామి తనవ్యాపారం మానలేదని, ఇప్పుడు చేనేతగుడ్డ ఎగుమతికి ప్రయత్నాలు సాగిస్తున్నాడని, తన బంధువులందరి పేరా వ్యాపారం పంచి ఏవో తంత్రాలన్నీ పన్నుతున్నాడని ఇదంతా తనను మోసగించటానికేననికూడా రఘుపతి చెబుతున్నాడు. ఈ మాట లన్నింటికీ ఎక్కడిక్? ఇందులో వ్యాపారపు కిటుకులెన్ని ఉంటాయో నాబోటివానికేం తెలుస్తుంది?

స్వామి పెద్దమనిషి, అతను రఘుపతి వ్యాపారం చెడిపోయినందుకు చాలా విచారిస్తున్నాడని నేను చెప్పగలను. చేసుకోవటం చేతకాక పనికి మాలినగుడ్డ యావత్తూ తన దగ్గిర పేరబెట్టుకున్నాడని, అంతా అమ్ముకుని వుంటే రఘుపతి నష్టపడేవాడుకాడని ఆపత్సమయంలో అతను తననేమైనా అంటే అంతమాత్రం చేత తను ఏమీ అనుకోబోవటంలేదని, ఇప్పటికైనా అతను జారిపోకుండా నిలబడితే చక్కగా వ్యాపారం మాట చూచుకోవచ్చునని స్వామి నాతో అన్నాడు. స్వామికి గొప్ప గొప్ప వాళ్ళదగ్గిర చాలా పలుకుబడి ఉంది. అతని ఇంటిదగ్గిర రోజూ కవులూ, రాజకీయవేత్తలూ, పండితులూ, ఇతరులూ చేరటం నేను కళ్ళారా చూచాను. అతను చేసే దానాలకి అంతేలేదనుకోండి. వెధవది ఏ కమ్యూనిస్టులో స్వామిని అనవలసిన మాటలు రఘుపతే అంటున్నాడంటే అతన్ని గురించి పెద్ద మనుషులేమనుకుంటారో నాకు బోధపడకుండా ఉంది !

ఎన్నయినా చెప్పండి, డబ్బు చాలా పాపిష్టిది. అది యుక్తా యుక్తాలుకూడా తెలియనివ్వదు !

— ముద్రణ : ఆంధ్రశిల్పి, మార్చి 1948.